క్లుప్తంగా

ఎక్సైజ్ దాడుల్లో నిందితుడి అరెస్టు


నిందితుడిని అరెస్టు చేసిన ఎక్సైజ్ సిబ్బంది

కాళ్ల: ప్రభుత్వ అనుమతులు లేకుండా అనధికారంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆకివీడు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలో ప్రొహిబిషనరీ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. భీమవరం ఈఎస్టీఎఫ్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో పెదఅమిరంలో అనధికారంగా మద్యం అమ్ముతున్న కోటపల్లి సుబ్బరాజును అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి ఆరు క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆకివీడు ఎక్సైజ్ ఎస్సై వి.కరుణప్రియ తెలిపారు.

శ్మశాన భూమిలో ఆక్రమణల తొలగింపు


శ్మశాన వాటికలో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక అమృతరావు కాలనీలోని శ్మశాన వాటికలో గత 30 ఏళ్లుగా జీవనం గడుపుతున్న కడు నిరుపేదలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఆక్రమణదారులకు గత ప్రభుత్వంలో ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇవ్వడంతో కొంతమంది ఆక్రమణదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. మరి కొంతమంది సొంత స్థలాలను సమకూర్చుకున్నారు. ఆక్రమణదారులను ఖాళీచేయమని నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో సిబ్బంది గత 15 రోజుల క్రితం ఆదేశాలిచ్చారు. ఆక్రమణలను బుధవారం స్వచ్ఛందంగా తొలగించారు. స్మశానవాటిక నుంచి వారికి విముక్తి కలిగింది.

నెట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



భీమవరంలో నెట్‌బాల్ పోటీలో విజేతలను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ నుంచి మూడు రోజులుపాటు అన్నమయ్య జిల్లా చిన్న తిప్పసముద్రం జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్–17 నెట్‌బాల్ బాలికల పోటీల్లో జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించినట్లు కోచ్ దావూద్ తెలిపారు. ఈ జట్టులో భీమవరం సీఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులనీలు టి ఉమాభవాని, వై వినీలవర్షిని ఉన్నారన్నారు. అనంతరం క్రీడాకారులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ, ప్రిన్సిపల్ ఎండి సలీం ఖాన్‌లు అభినందించారు.

ఓటర్ల జాబితా సరి చూసుకోండి

ఉండి: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించిన 382,383 పోలింగ్ కేంద్రాల ఓటర్ల జాబితా తహసీల్దార్ కార్యాలయంలో సిద్ధంగా ఉందని ఓటర్లు సరి చూసుకోవాలని తహసీల్దార్ కె.నాగార్జున పత్రికా ప్రకటనలో తెలిపారు. అలాగే ఆన్‌లైన్‌లో సీఈవోఏపీ వెబ్‌సైట్‌లో ఎలక్టోరల్ నందు ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ రోల్స్‌లో పరిశీలించుకోవచ్చునని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే ఫారం 8 ద్వారా సరి చేసుకోవాలన్నారు.

అండర్–14 క్రికెట్ జట్టుకు దుర్గారామ్ చరణ్ ఎంపిక


రామ్‌చరణ్‌ను అభినందిస్తున్న కృష్ణకిషోర్

భీమవరం: భీమవరం పట్టణానికి చెందిన విద్యార్థి ఒలిపల్లి దుర్గారామ్ చరణ్ ఎస్‌జీఎఫ్ఐ అండర్–14 క్రికెట్ టీంకు ఎంపికయ్యాడు. పట్టణంలోని శ్రీకాకతీయ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న దుర్గారామ్ చరణ్ అనంతపురంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో ఆడనున్నాడు. జోన్‌స్థాయి పోటీలకు ఎంపికై దుర్గారామ్‌చరణ్ తర్వాత జిల్లాస్థాయి జట్టులో ఆడాడు. దుర్గారామ్‌చరణ్‌ను స్కూల్ కరస్పాండెంట్ అక్కినేని కృష్ణ కిషోర్, డైరెక్టర్ రమేష్, రమాదేవి తదితరులు అభినందించారు.

అభివృద్ధికి నోచుకోని మార్కెట్ యార్డు


చిట్టడవిని తలపిస్తున్న మార్కెట్ యార్డు ప్రాంగణం


మార్కెట్ యార్డులో తెగిపడిన విద్యుత్ వైర్లు

- నిధులున్నా.. ఫలితం సున్నా
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

ఆకివీడు: వ్యయసాయ మార్కెట్ యార్డు ప్రాంగణం చిట్టడవిని తలపిస్తోంది. ప్రాంగణమంతా వర్షం వస్తే ముంపునకు గురవుతోంది. మార్కెట్‌యార్డులో రైతుల కార్యకలాపాలు లేకపోవడంతో షెడ్లు, భవనాలు నిరుపయోగంగా మారి, శిథిలావస్థకు చేరాయి. రైతులు ధాన్యం నిల్వ ఉంచేందుకు నిర్మించిన నాలుగు షెడ్లు ఇప్పటికే తుప్పు పట్టి, రేకులు ధ్వంసమయ్యాయి. షెడ్లలో వర్షం నీరు కురవడంతో షెడ్లు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. రైతులు ధాన్యం నిల్వ పోసుకునేందుకు షెడ్లను ముప్పై ఏళ్ల క్రితం నిర్మించారు. మార్కెట్ యార్డులో నిర్మించిన విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. విద్యుత్ తీగలు తెగిపడుతున్నాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. గతంలో వాకింగ్ చేసుకునే ప్రజలు, రైతుల కోసం మార్కెట్ యార్డులో విద్యుత్ సదుపాయం కల్పించి, లైట్లు ఏర్పాటు చేశారు. అవన్నీ శిథిలమయ్యాయి. రైతుల కోసం నిర్మించిన కల్లాలు శిథిలమవ్వడంతో ఆయా ప్రాంతాల్లో యువకులు క్రికెట్ ఆడుకుంటున్నారు. మందుబాబులకు ఈ ప్రాంతం అడ్డాగా మారింది. ప్రతి రోజూ ఈ ప్రాంతంలో మందు తాగి బాటిల్స్ పగులగొట్టి అరాచకాలకు పాల్పడుతున్నారు.

కోట్ల ఆదాయం.. అభివృద్ధి శూన్యం

ఆకివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీకి ప్రతీ ఏటా రూ.4 కోట్ల మేర ఆదాయం వస్తుంది. అధికారికంగా సుమారు రూ.30 కోట్ల మేర ఆదాయం నిల్వ ఉన్నట్లు తెలిసింది. మార్కెట్ యార్డులో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉంది. మార్కెట్ యార్డు అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా వెచ్చించే అవకాశం లేకపోవడంతో ఆదాయం బారుడు, అభివృద్ధి మూరెడు అన్న చందంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో గోదాములు

స్థానిక మార్కెట్ యార్డులో రెండు విశాలమైన గోదాములు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఏ విధంగానూ మార్కెటింగ్ అధికారులు వినియోగించుకోలేకపోతున్నారు. రైస్ మిల్లర్లకు, ఇతర వ్యాపారులకు అద్దెకు ఇచ్చినా ఏడాదికి మెయింటెనెన్స్ ఖర్చులైనా వస్తాయని చెబుతున్నారు.గోదాములను ఫిష్ ప్యాకింగ్, రొయ్యల స్టోరేజీలకు అనుకూలంగా మలుచుకుంటే మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

కోల్డ్ స్టోరేజీలను నిర్మించాలి



మార్కెట్ యార్డు రైతులకు ఉపయోగకరంగా ఉండాలి. రూ.కోట్ల ఆదాయం వస్తున్నా మార్కెట్‌యార్డు అభివృద్ధిని పట్టించుకోకపోవడం దారుణం. వర్షం వస్తే నీట మునిగి పోతుంది. డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలి. కోల్డ్ స్టోరేజీలను నిర్మించాలి

గొట్టుముక్కల బాబ్జీరాజు, మాజీ ఎంపీపీ, అయిభీమవరం

మౌలిక వసతులు కల్పించాలి



మార్కెట్‌యార్డు నిధులతో పుంత రోడ్లు నిర్మించి, రైతులకు మౌలిక వసతులు కల్పించాలి. పుంత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రైతులు పండించిన పంటను బయటకు తీసుకురావడానికి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది.

భూపతిరాజు బుజ్జిరాజు, రైతు, ఆకివీడు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

ఉండి: బాల్య వివాహాలు కేవలం నేరం మాత్రమే కాదు బాలికల జీవితాలకు అవి శాపంగా మారతాయని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఆర్.రాజేష్ అన్నారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తూ చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఉండిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి రాజేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు ఆడబిడ్డల జీవితాలను తారుమారు చేస్తాయన్నారు. బిడ్డలను ఎంతో ప్రేమగా చూసే తల్లిదండ్రులు వారికి వయసు రాకముందే వివాహాలు ఎందుకు చేస్తున్నారో ఆలోచించుకోవాలన్నారు. అబ్బాయికి 21 అమ్మాయికి 18 ఏళ్ల వయసు వస్తేనే వివాహాలు చేయాలని చట్టం చెబుతుందని తెలిపారు. చట్టాన్ని మీరి ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే అటువంటి వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్సై నసీరుల్లా అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, మహిళా పోలీసులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై నసీరుల్లా

ఉండి: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ప్రముఖపాత్ర వహిస్తాయని ఎస్సై ఎండీ నసీరుల్లా అన్నారు. బుధవారం సీసీ కెమెరాల ఏర్పాటుపై ఉండి, చెరుకువాడ, అర్తమూరు, ఎన్నార్పీ అగ్రహారం, కలిసిపూడి, పెదపుల్లేరు గ్రామాల్లో సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బందితో సమావేశాలు నిర్వహించి సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చెరుకువాడలో సర్పంచ్ కొండవేటి సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎస్సై నసీరుల్లా మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న నేరాలు త్వరితంగా పరిష్కారం కావాలంటే సీసీ కెమెరాల ఏర్పాటు చాలా ముఖ్యమన్నారు.ఎన్నో నేరాల్లో సీసీ కెమెరాల ద్వారా సేకరించిన సాక్ష్యాలతో కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో, వీధుల్లో, సెంటర్లలోనూ సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరావు


రైసు మిల్లును పరిశీలిస్తున్న డీఎస్ఓ ఎన్.సరోజ

ఉండి: తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి ఆరబోసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన ఒబ్బిడి చేసుకోవాలని ఎస్‌డీఓ ఎన్ సరోజా అన్నారు. బుధవారం మండలంలోని ఉండి, యండగండి, ఉప్పులూరు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో ఎస్‌డీఓ సరోజా,ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాస్ పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రానున్న మూడు రోజుల్లో ఫెంగల్ తుఫాన్ హెచ్చరికలు జారీ చేసిన దృష్ట్యా రైతులంతా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బీ సంధ్య, వ్యవసాయశాఖ సిబ్బంది,పలువురు అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆకివీడు: తుఫాన్ ప్రభావం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు కోతలను వాయిదా వేసుకోవాలని జిల్లా సివిల్ సప్లై అధికారిణి ఎస్.సరోజ సూచించారు. మండలంలోని అజ్జమూరు, మాదివాడ, గుమ్ములూరు గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించి, పరిశీలించారు. డీఎస్ఓతో పాటు తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, వ్యవసాయాధికారిణి ఎం.ప్రియాంక పాల్గొన్నారు.

దాన్యాన్ని మిల్లులకు తరలించండి

కాళ్ల: వాయుగుండం కారణంగా రాబోయే రెండు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున కోతలు కోసిన రైతులు తమ ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుని రైస్ మిల్లులకు తరలించుకోవాలని వ్యవసాయ శాఖ ఆకివీడు ఏడీఏ కె.శ్రీనివాసరావు రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ధాన్యం మాసూళ్లు వాయిదా వేసుకోండి


యనమదుర్రు గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో నిమ్మల శ్రీనివాస్

భీమవరం అర్బన్: బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కారణంగా వాతావరణ శాఖ మూడు రోజులు వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో మూడు రోజులు పాటు ధాన్యం మాసూళ్లను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులకు సూచించారు. భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామంలో ధాన్యం కల్లాలను బుధవారం ఏవో నిమ్మల శ్రీనివాస్ పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఇప్పటివరకు ధాన్యం కల్లాల్లో ధాన్యాన్ని గోనె సంచుల్లో పట్టి మార్కెట్‌కి తరలించాలన్నారు. వ్యవసాయ ఆయకట్టు లోపల ధాన్యం రాసులను వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలు నేపథ్యంలో మూడు రోజుల పాటు వరిమాసుళ్లను వాయిదా వేసుకోవాలని సూచించారు. ధాన్యం విక్రయాల్లో దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం కామన్ రకానికి రూ. 2,300, ఏ గ్రేడ్ రకానికి రూ.2,320 మద్దతు ధర కల్పిస్తుందన్నారు. అలాగే కొన్నిచోట్ల ధాన్యం పట్టు బడుల్లో 40 కేజీలు ధాన్యం 600 గ్రాములు సంచితో ఉండాలన్నారు. మండలంలో 11 రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఉండి: తల్లి మందలించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండిలోని గణపవరం రోడ్డులో నివాసముంటున్న బైరపోగు మధుకుమార్ (22) పెయింటింగ్ పని చేస్తూ జీవిస్తున్నాడు. అయితే కొంతకాలం నుంచి పెయింటింగ్ పనికి వెళ్లకపోవడంతో అతని తల్లి మందలిస్తూ ఉండేది. ఈ నెల 21వ తేదీన కొత్త బట్టలు కొనుక్కుంటానని తనకు డబ్బులు ఇవ్వాలని తల్లిని అడగడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో 22వ తేదీ మధ్యాహ్నం ఇంటి వద్దనే గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే అతనిని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 26వ తేదీ ఉదయం ఏడు గంటలకు మృతి చెందాడు. మృతుడి తల్లి శ్రీదేవి ఫిర్యాదు మేరకు ఏఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
TATA INTRA V30 BS VI
2022 MODEL AP39 UE 9246
Cell : 99594 43428
7-1/1-2, 2nd Floor, Opp. Union Bank, JP Road, Chinnamiram, BHIMAVARAM.

కేంద్ర మంత్రికి వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ


కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ తండ్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


భీమవరంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

ఉండి: కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను బుధవారం ఉండి వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. పార్టీ నాయకులు గుండాబత్తుల సుబ్బారావు, రణస్తుల మహంకాళి, అంగర రాంబాబు, ఏడిద వెంకటేశ్వరరావు, రాయి సతీష్, అడబాల వరప్రసాద్, తోట భరత్, తదితరుల బృందం భీమవరంలో కేంద్రమంత్రి స్వగృహంలో ఆయన తండ్రి సూర్యనారాయణరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

భీమవరం: కేంద్ర ఉక్కు, భారీపరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను బుధవారం ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ పరామర్శించారు. శ్రీనివాసవర్మ తండ్రి భూపతిరాజు సూర్యనారాయణరాజు ఇటీవల మృతి చెందడంతో భీమవరం పట్టణం నర్సయ్యఅగ్రహారంలోని శ్రీనివాసవర్మ నివాసానికి రవీంద్రనాథ్ వెళ్లి సూర్యనారాయణరాజు చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు


ఆటల పోటీల్లో పాల్గొన్న దివ్యాంగ విద్యార్థులు

భీమవరం: దివ్యాంగుల కార్తీకమాస సమారాధన సందర్భంగా బుధవారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 29న పట్టణంలోని శ్రీవెంకటేశ్వర బధిర పాఠశాల, డాక్టర్ రమణరాజు అంధ పాఠశాల, అరుణోదయ మనోవికాస కేంద్రంలోని విద్యార్థులకు వనసమారాధన నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా వెంకటేశ్వర బధిర పాఠశాలలో వాలీబాల్, షటిల్, రోప్ స్కిప్పింగ్, రన్నింగ్, క్యారమ్స్, డ్రాయింగ్ పోటీలు, అంధ పాఠశాలలో భగవద్గీత పోటీలు, మనోవికాస కేంద్రంలో వారికి సంబంధించిన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 130మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 29న భీమవరం మార్కెట్ యార్డులో వనసమారాధన సందర్భంగా విజేతలకు యూత్ హాస్టల్స్ ఆఫ్ ఇండియా అసోసియేషన్ చైర్మన్ చిలుకూరి నర్సింహారాజు, కంతేటి వెంకట్రాజు సహకారంతో బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యువీ రమణరాజు, చింతలపాటి అరుణదేవి, నాగ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రామం ఆశయ సాధనకు కృషి చేయాలి


భీమవరంలో రామం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరంలో కమ్యూనిస్టు నిర్మాణం కోసం, రైతుల సమస్యలపై పోరాడిన వ్యక్తి ఉద్దరాజు రామం అని సీపీఎం నాయకుడు వైకుంఠరావు అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో బుధవారం రామం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఉద్దరాజు రామం దళితులు, అణగారిన వర్గాల పట్ల ప్రేమానురాగాలు చూపి కష్టజీవులు బతుకులు బాగుపడాలని అనేక పోరాటాలు చేసిన మహానీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ఎం ఆంజనేయులు, కె క్రాంతి బాబు, లతకుమారి, డి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక నేరాలపై మౌనం తగదు

ఆకివీడు: ఆర్థిక నేరాలపై మౌనం వహించడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. స్థానిక సమతానగర్ రోడ్డులోని ఫంక్షన్ హాలులో పార్టీ తొమ్మిదో మండల మహాసభ నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశ సంపదను మొత్తం అదాని, అంబానీ చేతుల్లోకి పెట్టి దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీశారని ధ్వజమెత్తారు. ఆకివీడులో గత నాలుగు నెలలుగా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పేదల ఇళ్లను తొలగించే పనిలో ప్రజా ప్రతినిధులు నిమగ్నమయ్యారని బలరాం ఎద్దేవా చేశారు.

లక్ష్మీనారాయణమ్మ నేత్రదానం



భీమవరం: నేత్రదానం చేయండి ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగు నింపండి అనే సూక్తికి అర్థం చెబుతూ భీమవరం పట్టణానికి చెందిన పెన్మెత్స లక్ష్మి నారాయణమ్మ కుటుంబసభ్యులు నేత్రదానం చేశారు. లక్ష్మినారాయణమ్మ(92) మంగళవారం మృతి చెందారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. లక్ష్మి నారాయణమ్మ కార్నియాలను కుటుంబ సభ్యులు భీమవరం పట్టణానికి చెందిన నేత్ర వైద్యుడు యూవీ రమణరాజు ఆధ్వర్యంలో నేత్రాలను దానం చేశారు.





